www.eenadupratibha.net

# BOARD OF SECONDARY EDUCATION (AP)

## SUMMATIVE ASSESSMENT – I

## TENTH CLASS TELUGU MODEL PAPER

## PAPER – II

సమయం: 2 గం. 45 ని. **పార్టు – A & B** గరిష్ఠ మార్కులు: 40

సూచనలు: 1) ప్రశ్నపత్రంలో పార్టు – A, B అనే రెండు విభాగాలుంటాయి.

2) పరీక్ష ప్రారంభంలోనే పార్టు – Aతోపాటు పార్టు– B కూడా ఇస్తారు.

3) మొదటి 15 నిమిషాలు ప్రశ్నపత్రం చదువుకోవడానికి, జవాబులు రాయడానికి 2 గం. 30 నిమిషాలు కేటాయించారు.

4) పార్టు – B సమాధానాలు ప్రశ్నపత్రంలోనే రాయాలి.

సమయం: 2 గంటలు **పార్టు - A** మార్కులు: 30

**I. అవగాహన - ప్రతిస్పందన** (12 మార్కులు)

1. కింది వాక్యాలను సంఘటనా క్రమంలో అమర్చండి. 4 × 1 = 4

అ) శ్రీరామ దర్శనంతో శబరి తనువు పులకరించింది.

ఆ) శ్రీరాముడి అనుమతితో దేహాన్ని అగ్నికి ఆహుతి చేసి ఊర్ధ్వ లోకాలను పొందింది.

ఇ) పంపాతీరంలో ఉన్న శబరి ఆశ్రమానికి చేరుకున్నారు రామ లక్ష్మణులు.

ఈ) పంపాతీరంలో దొరికే పండ్లను స్వామికి సమర్పించింది.

కింది అపరిచిత పద్యాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి. 4 × 1 = 4

పరనారీ సోదరుడై
పరధనముల కాశపడక! పరహిత దారై
పరులలిగిన తానలగక
పరులెన్నగ బ్రతుకువాడు! ప్రాజ్ఞుడు వేమా!

ప్రశ్నలు:

2. పరస్త్రీని మనం ఎలా భావించాలి?

3. ఎవరి ధనాన్ని ఆశించరాదు?

4. ఇతరులు కోపించినా, తాను కోపించనివాడిని ఏమంటారు?

5. పై పద్యం ఆధారంగా ఒక ప్రశ్నను తయారు చేయండి.

కింది అపరిచిత గద్యాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి. $4 \times \frac{1}{2} = 2$

ఒక జాతిని ఆయుధంతో మాత్రమే జయించడం అసాధ్యం. విజేతలంతా పరాజితుల సంస్కృతి మీద దండెత్తుతారు. అయితే భారతీయ నాగరికత, సంస్కృతి మీద ఆంగ్లేయులు వేసినంతటి ప్రభావం మరే విజేతా వేయలేదు. విజేతలైన ఆంగ్లేయులకు భారత సమాజాన్ని, భారతీయ జీవనాన్ని గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అందుకే భారతీయ సంస్కృతి, నాగరికత మీద తమ ప్రభావాన్ని చూపించడానికి సాహిత్యమే ఉత్తమ సాధనమని వారు గ్రహించారు. తమ సాహిత్యాన్ని మనం కోరకనే అందించారు.

ప్రశ్నలు:

**6.** భారతీయ నాగరికత, సంస్కృతి మీద ఎవరి ప్రభావం ఎక్కువగా ఉంది?

**7.** పరాజితుల సంస్కృతిపై దండెత్తేది ఎవరు?

**8.** ఆంగ్లేయులు మనం కోరకుండానే వారి సాహిత్యాన్ని అందించడానికి కారణం ఏమిటి?

**9.** పై పేరా ఆధారంగా ఒక ప్రశ్నను తయారు చేయండి.

**కింది పుస్తక సమీక్షను చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.** $4 \times \frac{1}{2} = 2$

కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లోని కొంత భాగమే 'మొరసునాడు'. ఈ ప్రాంత ప్రజల భాష, వారి ఆలోచనలను, మొత్తం బతుకు చిత్రాన్నంతా కథల రూపంలో కళ్లకు కట్టే పుస్తకం 'రాగెన్నుల రాజ్జం'. ఇందులో పదిహేను కథలు ఉన్నాయి. అన్నీ అక్కడి మాండలికంతో గుబాళించేవే! ఈ కథలన్నీ బతుకు చిత్రాలను చూపించేవే! అందుకే ఆ కథలన్నీ గుండెకు హత్తుకునేలా ఉంటాయి.

ప్రశ్నలు:

**10.** ఏ కథలు బతుకు చిత్రాలను చూపిస్తాయి?

**11.** 'రాగెన్నుల రాజ్జం' కథాసంపుటిలో ఎన్ని కథలు ఉన్నాయి?

**12.** మొరసునాడు ప్రజల బతుకు చిత్రాన్ని కళ్లకు కట్టే కథాసంపుటం ఏది?

**13.** పై పేరా ఆధారంగా ఒక ప్రశ్నను తయారు చేయండి.

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత (18 మార్కులు)

**కింది లఘు ప్రశ్నలకు జవాబులు రాయండి.** $2 \times 2 = 4$

**14.** దశరథుడి పాత్ర స్వభావాన్ని రాయండి.

**15.** 'రాముడితో కయ్యం కొరివితో తల గోక్కునట్లే' అన్న మారీచుడి మాటలను బట్టి మీరేం గ్రహించారు?

**కింది ప్రశ్నల్లో ఒకదానికి పది లేదా పన్నెండు వాక్యాల్లో జవాబులు రాయండి.** $1 \times 4 = 4$

**16.** సీతాపహరణం గురించి రాయండి.

**(లేదా)**

'మానవ జీవితాలను సంస్కరించ గల మహాకావ్యం రామాయణం'. సమర్థించండి.

**కిందివాటిలో రెండు ప్రశ్నలకు జవాబులు రాయండి.** $2 \times 5 = 10$

**17.** మీ పాఠశాలలో పఠనోత్సవాన్ని ఎలా నిర్వహించారో తెలుపుతూ మీ మిత్రుడికి లేఖ రాయండి.

**(లేదా)**

దానం వల్ల కలిగే లాభాలను వివరిస్తూ కరపత్రం రాయండి.

**18.** మాతృభావన పాఠం ఆధారంగా స్త్రీల పట్ల మనం ఎలా ప్రవర్తించాలో, మన బాధ్యతలు ఏమిటో తెలిసేలా అయిదు నినాదాలు/సూక్తులు రాయండి.

**(లేదా)**

మీ పాఠశాల వార్షికోత్సవానికి అతిథిగా వచ్చిన స్త్రీ వాద రచయిత్రులను ఎలా ప్రశ్నించనున్నారో ప్రశ్నల జాబితా రాయండి.

www.eenadupratibha.net

సమయం: 30 నిమిషాలు | **పార్టు - B** | మార్కులు: 10

**III. భాషాంశాలు** (10 మార్కులు)

**సూచన:** పార్టు – Bకి సంబంధించిన సమాధానాలు ఈ ప్రశ్నపత్రంలోనే రాసి పార్టు – A సమాధాన పత్రానికి జత చేయండి.

కింద ఇచ్చిన ప్రశ్నలకు సరైన జవాబులను గుర్తించండి. $20 \times \frac{1}{2} = 10$

**19.** సాధుసంగంబు సకలార్థ సాధకంబు (ఆధునిక వచనాన్ని గుర్తించండి) ( )

ఎ) సాధువులు అన్నీ చూడగలరు. బి) సాధువులను కలిస్తే అన్నీ నెరవేరుతాయా?

సి) సాధువులను కలిస్తే అన్నీ నెరవేరవు. డి) సాధుసంగం సకలార్థ సాధకం.

**20.** కరవటంబున జగదండ ఖండమమరె! (ఆధునిక వచనాన్ని గుర్తించండి) ( )

ఎ) కరవటంలో జగదండ ఖండం అమరింది. బి) కరవటంలో జగదండ ఖండం అమరలేదు.

సి) కాటుక నింపిన భరణిలా అనిపించింది. డి) భరణిలో నింపిన కాటుక వలే ఉంది.

**21.** రైతులు పంటలు పండించారు. (కర్మణి వాక్యాన్ని గుర్తించండి) ( )

ఎ) రైతులు పంటలచే పండించారు. బి) రైతులచే పంటలను పండింపబడ్డాయి.

సి) రైతులు పంటలను పండించారు. డి) పంటలచేత రైతులు పండింపబడ్డారు.

**22.** 'అమరావతి రాజధాని నగరంగా తీర్చిదిద్దబడింది'. (కర్తరి వాక్యాన్ని గుర్తించండి) ( )

ఎ) అమరావతిని రాజధాని నగరంగా తీర్చిదిద్దుతున్నారా?

బి) అమరావతిని రాజధాని నగరంగా తీర్చిదిద్దారు.

సి) అమరావతిని రాజధాని నగరంగా తీర్చిదిద్దడం లేదు.

డి) అమరావతిని రాజధాని నగరంగా తీర్చిదిద్దబోతున్నారు.

**23.** 'ప్రజ్ఞ పద్యాలు బాగా పాడింది' అని అందరూ అన్నారు. (పరోక్ష కథనాన్ని గుర్తించండి) ( )

ఎ) ప్రజ్ఞ పద్యాలు బాగా పాడలేదని అందరూ అన్నారు.

బి) ప్రజ్ఞ పద్యాలు పాడుతుందని అందరూ అనలేదు.

సి) ప్రజ్ఞ అందరూ పద్యాలు బాగా పాడారని అంది.

డి) ప్రజ్ఞ పద్యాలు బాగా పాడిందని అందరూ అన్నారు.

**24.** 'కుప్ప పల్లాన్ని పడ్డదని' కోటయ్య అన్నాడు. (ప్రత్యక్ష కథనాన్ని గుర్తించండి) ( )

ఎ) కుప్ప పల్లాన్ని పడింది అని కోటయ్య అన్నాడు.

బి) 'కుప్ప పల్లాన్ని పడ్డది' అని కోటయ్య అన్నాడు.

సి) 'కుప్పలు, పల్లాలు పడ్డాయని' కోటయ్య అన్నాడు.

డి) 'కుప్ప పల్లాన్ని పడలేదు' అని కోటయ్య అన్నాడు.

**25.** ఎందరో స్త్రీలను గుర్తించారు. (వ్యతిరేకార్థక వాక్యాన్ని గుర్తించండి) ( )

ఎ) ఎందరో స్త్రీలను గుర్తించలేదు. బి) ఎందరో స్త్రీలు గుర్తించబోతున్నారు.

సి) ఎందరో స్త్రీలను గుర్తించబోవడం లేదు డి) ఎందరో స్త్రీలను గుర్తిస్తున్నారు.

**26.** రామకృష్ణ, వివేకానందులు గురుశిష్యులు. (ఏ వాక్యమో గుర్తించండి) ( )

ఎ) సామాన్య వాక్యం బి) సంశ్లిష్ట వాక్యం

సి) సంయుక్త వాక్యం డి) మహా వాక్యం

www.eenadupratibha.net

**27.** 'జూడాకర్ణుడు హిరణ్యకుడు దాచుకున్న ధనాన్ని తవ్వి తీశాడు'. (ఏ వాక్యమో గుర్తించండి) ( )

ఎ) సంశ్లిష్ట వాక్యం బి) సంయుక్త వాక్యం సి) మహా వాక్యం డి) సామాన్య వాక్యం

**28.** కిందివాటిలో చేదర్థక వాక్యాన్ని గుర్తించండి. ( )

ఎ) విద్యార్థులు బాగా చదివి మార్కులు సంపాదించండి.

బి) విద్యార్థులు బాగా చదివితే మంచి మార్కులు వస్తాయి.

సి) విద్యార్థులు బాగా చదివినా మంచి మార్కులు వస్తాయి.

డి) విద్యార్థులు బాగా చదవడం వల్ల మంచి మార్కులు వస్తాయి.

**29.** 'భూతకాలిక అసమాపక క్రియ'ను ఏమని పిలుస్తారు? ( )

ఎ) క్త్వార్థం బి) శత్రర్థం సి) చేదర్థం డి) అనుమత్యర్థం

**30.** కిందివాటిలో సరైన ఆశీరర్థక వాక్యాన్ని గుర్తించండి. ( )

ఎ) నువ్వు మంచిగా ఉండు బి) నూరేళ్లు జీవించ వచ్చునా?

సి) నూరేళ్లు జీవించు డి) నూరేళ్లు జీవించలేవు

**31.** వినయ్ పాటలు బాగా పాడగలడు. (ఏ అర్థక వాక్యం) ( )

ఎ) సామర్థ్యార్థక బి) అనుమత్యర్థక సి) నిషేధార్థక డి) ప్రార్థనార్థక

**32.** 'నీవిక్కడ వసింప దగదు'. (ఏ వాక్యమో గుర్తించండి). ( )

ఎ) అనుమత్యర్థక బి) ప్రార్థనార్థక సి) నిషేధార్థక డి) సామర్థ్యార్థక

**కింది జాతీయాలను ఏ సందర్భంలో ఉపయోగిస్తారో రాయండి.**

**33.** కలుపు దీయడం: ................................

**34.** అగ్రతాంబూలం: ...........................

**35.** ఉన్నదంతా ఊడ్చుకుపోవడం: ...........................

**కింది పదాలతో సొంత వాక్యాలు రాయండి.**

**36.** వైభవోపేతం: ......................

**37.** తిప్పుకొను: ......................

**38.** సతమతం: ............................

www.eenadupratibha.net

## సమాధానాలు

### పార్టు – A

**I. అవగాహన - ప్రతిస్పందన**

**1.** కింది వాక్యాలను సంఘటనా క్రమంలో అమర్చండి.

అ) శ్రీరామ దర్శనంతో శబరి తనువు పులకరించింది.

ఆ) శ్రీరాముడి అనుమతితో దేహాన్ని అగ్నికి ఆహుతి చేసి ఊర్ధ్వ లోకాలను పొందింది.

ఇ) పంపాతీరంలో ఉన్న శబరి ఆశ్రమానికి చేరుకున్నారు రామ లక్ష్మణులు.

ఈ) పంపాతీరంలో దొరికే పండ్లను స్వామికి సమర్పించింది.

జ: ఇ) పంపాతీరంలో ఉన్న శబరి ఆశ్రమానికి చేరుకున్నారు రామ లక్ష్మణులు.

అ) శ్రీరామ దర్శనంతో శబరి తనువు పులకరించింది.

ఈ) పంపాతీరంలో దొరికే పండ్లను స్వామికి సమర్పించింది.

ఆ) శ్రీరాముడి అనుమతితో దేహాన్ని అగ్నికి ఆహుతి చేసి ఊర్ధ్వ లోకాలను పొందింది.

**కింది అపరిచిత పద్యాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.**

పరనారీ సోదరుడై
పరధనముల కాశపడక! పరహిత దారై
పరులలిగిన తానలగక
పరులెన్నగ బ్రతుకువాడు! ప్రాజ్ఞుడు వేమా!

ప్రశ్నలు:

**2.** **పరస్త్రీని మనం ఎలా భావించాలి?**

జ: సోదరిలా భావించాలి.

**3.** **ఎవరి ధనాన్ని ఆశించరాదు?**

జ: ఇతరుల ధనాన్ని ఆశించరాదు.

**4.** **ఇతరులు కోపించినా, తాను కోపించనివాడిని ఏమంటారు?**

జ: ప్రాజ్ఞుడు అంటారు.

**5.** **పై పద్యం ఆధారంగా ఒక ప్రశ్నను తయారు చేయండి.**

జ: ప్రాజ్ఞుడు అంటే ఏమిటి?

**కింది అపరిచిత గద్యాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.**

ఒక జాతిని ఆయుధంతో మాత్రమే జయించడం అసాధ్యం. విజేతలంతా పరాజితుల సంస్కృతి మీద దండెత్తుతారు. అయితే భారతీయ నాగరికత, సంస్కృతి మీద ఆంగ్లేయులు వేసినంతటి ప్రభావం మరే విజేతా వేయలేదు. విజేతలైన ఆంగ్లేయులకు భారత సమాజాన్ని, భారతీయ జీవనాన్ని గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అందుకే భారతీయ సంస్కృతి, నాగరికత మీద తమ ప్రభావాన్ని చూపించడానికి సాహిత్యమే ఉత్తమ సాధనమని వారు గ్రహించారు. తమ సాహిత్యాన్ని మనం కోరకనే అందించారు.

ప్రశ్నలు:

**6.** **భారతీయ నాగరికత, సంస్కృతి మీద ఎవరి ప్రభావం ఎక్కువగా ఉంది?**

జ: భారతీయ నాగరికత, సంస్కృతి మీద ఆంగ్లేయుల ప్రభావం ఎక్కువగా ఉంది.

**7.** **పరాజితుల సంస్కృతిపై దండెత్తేది ఎవరు?**

జ: పరాజితుల సంస్కృతిపై దండెత్తేది విజేతలు.

**8. ఆంగ్లేయులు మనం కోరకుండానే వారి సాహిత్యాన్ని అందించడానికి కారణం ఏమిటి?**

జ: విజేతలైన ఆంగ్లేయులు భారత సమాజాన్ని, భారతీయ జీవనాన్ని గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అందువల్ల ఆంగ్లేయులు మనం కోరకుండానే వారి సాహిత్యాన్ని అందించారు.

**9. పై పేరా ఆధారంగా ఒక ప్రశ్నను తయారు చేయండి.**

జ: ఒక జాతిని దేంతో మాత్రమే జయించడం అసాధ్యం?

**కింది పుస్తక సమీక్షను చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.**

కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లోని కొంత భాగమే 'మొరసునాడు'. ఈ ప్రాంత ప్రజల భాష, వారి ఆలోచనలను, మొత్తం బతుకు చిత్రాన్నంతా కథల రూపంలో కళ్లకు కట్టే పుస్తకం 'రాగెన్నుల రాజ్యం'. ఇందులో పదిహేను కథలు ఉన్నాయి. అన్నీ అక్కడి మాండలికంతో గుబాళించేవే! ఈ కథలన్నీ బతుకు చిత్రాలను చూపించేవే! అందుకే ఆ కథలన్నీ గుండెకు హత్తుకునేలా ఉంటాయి.

ప్రశ్నలు:

**10. ఏ కథలు బతుకు చిత్రాలను చూపిస్తాయి?**

జ: 'రాగెన్నుల రాజ్యం' కథలు బతుకు చిత్రాలను చూపిస్తాయి.

**11. 'రాగెన్నుల రాజ్యం' కథాసంపుటిలో ఎన్ని కథలు ఉన్నాయి?**

జ: 'రాగెన్నుల రాజ్యం' కథాసంపుటిలో పదిహేను కథలు ఉన్నాయి.

**12. మొరసునాడు ప్రజల బతుకు చిత్రాన్ని కళ్లకు కట్టే కథాసంపుటం ఏది?**

జ: మొరుసునాడు ప్రజల బతుకు చిత్రాన్ని కళ్లకు కట్టే కథాసంపుటం 'రాగెన్నుల రాజ్యం'.

**13. పై పేరా ఆధారంగా ఒక ప్రశ్నను తయారు చేయండి.**

జ: ఏ కథలు గుండెకు హత్తుకునేలా ఉంటాయి?

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**కింది లఘు ప్రశ్నలకు జవాబులు రాయండి.**

**14. దశరథుడి పాత్ర స్వభావాన్ని రాయండి.**

జ: దశరథుడు కోసల దేశ పరిపాలకుడు. మహావీరుడు, దేవతల పక్షాన ఎన్నో యుద్ధాలు చేశాడు, ధర్మ పరాయణుడు, ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకునేవాడు. దశరథుడి పాలనలో కోసల దేశం భోగ భాగ్యాలతో విలసిల్లింది. కైకేయికి ఇచ్చిన వరాల వల్ల శ్రీరాముడిని వనవాసానికి పంపాడు.

**15. 'రాముడితో కయ్యం కొరివితో తల గోక్కునట్లే' అన్న మారీచుడి మాటలను బట్టి మీరేం గ్రహించారు?**

జ: రావణుడు మారీచుడి వద్దకు వచ్చి సీతను అపహరించడానికి తనకు సాయం చేయమని కోరాడు. రాముడి జోలికి వెళ్లడం మంచిది కాదని, ఇతరులకు హాని చేయాలనే ఆలోచన లేని, ప్రశాంతంగా ఉన్న రాముడితో పెట్టుకుంటే కొరివితో తల గోక్కున్నట్లే అని నేను గ్రహించాను.

**కింది ప్రశ్నల్లో ఒకదానికి పది లేదా పన్నెండు వాక్యాల్లో జవాబులు రాయండి.**

**16. సీతాపహరణం గురించి రాయండి.**

జ: సీతారాములు పంచవటిలో ఆనందంగా జీవిస్తున్నారు. రావణుడి చెల్లెలైన శూర్పణక అక్కడికి వచ్చి రాముడి అందానికి ముగ్ధురాలై తనను భార్యగా స్వీకరించమని కోరింది. అప్పుడు కోపోద్రిక్తుడైన లక్ష్మణుడు శూర్పణక ముక్కు, చెవులు కోశాడు. ఈ విషయాన్ని శూర్పణక ఖరుడికి చెప్పింది. ఖరుడు పంపిన యోధులను, ఖరదూషణులను మొత్తం 14 వేల మంది రాక్షసులను రాముడు గడియలో చంపాడు.

ఈ విషయం అకంపనుడు గమనించి దండకంలో రాక్షస సంహారం జరిగిందని రావణుడికి చెప్పాడు. సీతను అపహరించడానికి తనకు సాయం చేయాలని రావణుడు మారీచుడిని అడిగాడు. మారీచుడు రాముడితో పెట్టుకోవద్దని రావణుడికి సలహా చెప్పాడు. శూర్పణక సీతను అపహరించమని రావణుడికి సలహా ఇచ్చింది. రావణుడు మళ్లీ మారీచుడి వద్దకు వెళ్లి సీతాపహరణకు బంగారు లేడిగా మారి తనకు సాయం చేయమని అడిగాడు. మారీచుడు హితం చెప్పినా వినకుండా, తనకు

సహాయం చేయకపోతే చంపుతానన్నాడు.

మారీచుడు బంగారు లేడిగా మారి, సీతారాములు ఉండే ఆశ్రమ ప్రాంతంలో తిరిగాడు. సీత బంగారు లేడిని చూసి ముచ్చటపడింది. ఆ బంగారు లేడిని పట్టి తెమ్మని, సీత రాముడిని కోరింది. అది మాయలేడి అని లక్ష్మణుడు చెప్పాడు. కానీ రాముడు సీత మాట కాదనలేకపోయాడు. లక్ష్మణుడిని సీతకు కాపలాగా ఉంచి, తాను లేడి కోసం వెళ్లాడు. రాముడు దానిపై బాణం వేశాడు. మాయలేడి చస్తూ 'హా సీతా!! హా లక్ష్మణా!!' అని అరిచింది.

ఆ ధ్వని విన్న సీత రాముడు ఆపదలో ఉన్నాడని లక్ష్మణుడిని సాయం చేయడానికి వెళ్లమని కోరింది. లక్ష్మణుడు కాదంటే అతడిని నిందించడంతో చివరకు వెళ్లాడు. ఇదే అదనుగా రావణుడు సన్యాసి వేషంలో సీత ఉన్న ఆశ్రమానికి వచ్చి, తాను రావణుడిని అని చెప్పి సీతను బలవంతంగా లంకా నగరానికి తీసుకువెళ్లాడు.

**(లేదా)**

ప్ర. **'మానవ జీవితాలను సంస్కరించ గల మహాకావ్యం రామాయణం'. సమర్థించండి.**

జ: 'మానవ జీవితాలను సంస్కరించ గల మహా కావ్యం రామాయణం'. ఈ కథ మానవ హృదయాల నుంచి ఎప్పటికీ చెరగనిది. రామాయణం జీవిత సామర్థ్యాలెన్నింటినో తెలియజేస్తుంది. రామాయణంలో అమ్మానాన్నల అనురాగం, పుత్రుల అభిమానం, అన్నదమ్ముల అనుబంధం, భార్యాభర్తల సంబంధం, గురుభక్తి, శిష్యానురక్తి, స్నేహఫలం, ధర్మబలం, జీవకారుణ్య భావన, ప్రకృతి లాలన లాంటి జీవిత పార్శ్వాలెన్నో కనిపిస్తాయి.

రామాయణాన్ని చదవడం అంటే జీవితాన్ని చదవడమే. రామాయణం ఆచరణ ప్రధాన గ్రంథం. ఉత్తమ ధర్మాలను ఆచరిస్తే, మనిషి మనిషిగా ఎలా ఎదగగలడో రామాయణం నేర్పుతుంది. చిన్న చిన్న పాత్రల ద్వారా రామాయణం గొప్ప సందేశాన్ని అందిస్తుంది. వాల్మీకి మహర్షి మారీచుడు అనే రాక్షసుడి నోటి నుంచి 'రామో విగ్రహవాన్ ధర్మః, సత్యధర్మ పరాక్రమః' అనే గొప్ప మాటలు పలికించాడు. రాముడి లాంటి ఆదర్శమూర్తి, రామాయణం లాంటి ఆదర్శ కావ్యం 'నభూతో నభవిష్యతి!'. రామాయణం ప్రపంచ సాహిత్యంలోనే గొప్ప 'ఆదికావ్యం'. వాల్మీకి సంస్కృతంలో 24 వేల శ్లోకాలను రాశాడు. రామాయణం ముందు తరాల వారికి గొప్ప స్ఫూర్తిని ఇస్తుంది. అందువల్లే మనం రామాయణం తప్పక చదవాలి.

**కిందివాటిలో రెండు ప్రశ్నలకు జవాబులు రాయండి.**

**17. మీ పాఠశాలలో పఠనోత్సవాన్ని ఎలా నిర్వహించారో తెలుపుతూ మీ మిత్రుడికి లేఖ రాయండి.**

జ:

అమరావతి,

13-12-2017.

ప్రియ మిత్రుడు సందీప్‌కు,

నీ మిత్రుడు హరీష్ రాయునది, ఉభయకుశలోపరి. మా పాఠశాలలో 2017 నవంబరు 8 నుంచి 14 వరకు 'పఠనోత్సవం'ను నిర్వహించారు. అక్టోబరు 8న మా పాఠశాలలో పద్యాల పోటీలు జరిగాయి. వారం రోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమంలో నవంబరు 14న బహుమతి ప్రధానోత్సవం అత్యంత వైభవోపేతంగా జరిగింది. మీ పాఠశాలలో జరిగిన పఠనోత్సవం గురించి కూడా లేఖ రాయి.

**చిరునామా:**

వి. సందీప్,

10వ తరగతి,

హంసవాహినీ విద్యాలయం,

ఏలూరు,

పశ్చిమ గోదావరి జిల్లా.

ఇట్లు

నీ మిత్రుడు,

కె. హరీష్,

అమరావతి.

**(లేదా)**

ప్ర. **దానం వల్ల కలిగే లాభాలను వివరిస్తూ కరపత్రం రాయండి.**

జ: **దానం వల్ల కలిగే లాభాలు**

మన ఇరుగు పొరుగు వారిలో ఎంతోమంది పేదలు ఉంటారు. భగవంతుడు మానవులందరిలోనూ ఉంటాడు. కాబట్టి మనుషులు అంతా దైవంతో సమానం. కానీ అందరి మానవుల్లో కొందరు ధనవంతులు, కొందరు పేదవారు ఉంటారు.

ముఖ్యంగా పేదవారికి మనకు ఉన్నంతలో దానం చేయాలి. మన తరగతిలోని పేదవారికి పుస్తకాలు, పెన్నులు, నోట్సులు ఇవ్వాలి. పరీక్ష ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న వారికి డబ్బు సాయాన్ని అందించాలి. పేదవారికి తగిన వైద్య సహాయాన్ని కూడా అందించాలి. ఉదయాన్నే ఎంతోమంది అనాథలు ఇంటి ముందుకు వచ్చి డబ్బులడుగుతుంటారు. వారికి మనం ఎంతో కొంత సాయాన్ని తప్పకుండా చేయాలి.

పేదవారికి దానం చేస్తే మళ్లీ జన్మలో మనకు భగవంతుడు మరింతగా ఇస్తాడు. పేదల ముఖాల్లో ఆనందం కనిపించేలా చేస్తే, మన జీవితాలు సుఖసంతోషాలకు నిలయం అవుతాయి. నేను నాకు ఉన్నంతలో పేదలకు దానం చేస్తాను. అలాగే మనకు ఎన్నో దానాలు ఉన్నాయి. అన్నింటిలో అన్నదానం గొప్పది.

ఇట్లు

10వ తరగతి విద్యార్థుల సంఘం.

**18. మాతృభావన పాఠం ఆధారంగా స్త్రీల పట్ల మనం ఎలా ప్రవర్తించాలో, మన బాధ్యతలు ఏమిటో తెలిసేలా అయిదు నినాదాలు/ సూక్తులు రాయండి.**

జ: **నినాదాలు:**

1) పతివ్రతలు అనలజ్యోతులు.

2) స్త్రీ రత్నాలు పూజార్హులు. వారిని అవమానించకూడదు.

3) భరతమాత ఆడబిడ్డలు, భారతావని భాగ్య కల్పలతలు.

4) వనితా రత్నాలు, భారత భూజంగమ పుణ్యదేవతలు.

5) స్త్రీలను గౌరవించు – శ్రీదేవిని ఇంటికి రప్పించు.

6) మహిళలు – మన జాతి మాణిక్యాలు.

**(లేదా)**

ప్ర. **మీ పాఠశాల వార్షికోత్సవానికి అతిథిగా వచ్చిన స్త్రీ వాద రచయిత్రులను ఎలా ప్రశ్నించనున్నారో ప్రశ్నల జాబితా రాయండి.**

**ప్రశ్నావళి:**

1) స్త్రీ వాదం ప్రాముఖ్యం ఏమిటి?

2) ప్రస్తుతం స్త్రీలకు నిజంగానే స్వాతంత్ర్యం లేదా?

3) స్త్రీలకు ఎలాంటి స్వాతంత్ర్యం కావాలి?

4) స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలకు వారి వేషభాషలే కారణమా?

5) స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలేమిటి?

6) స్త్రీలకు ఆర్థిక స్వాతంత్ర్యం వస్తే వారి సమస్యలు తీరతాయా?

www.eenadupratibha.net

## పార్టు – B జవాబులు

**III. భాషాంశాలు**

19-డి; 20-ఎ; 21-బి; 22-బి; 23-డి; 24-బి; 25-ఎ; 26-ఎ; 27-ఎ; 28-బి; 29-ఎ; 30-సి; 31-ఎ; 32-సి.

**జాతీయాలు**

**33.** పిచ్చి మొక్కలను ఏరిపారేయడం అనే సందర్భంలో ఉపయోగిస్తారు.

**34.** అందరికంటే ముందుగా గుర్తింపబడటం అనే సందర్భంలో వాడతారు.

**35.** పూర్తిగా నాశనం కావడం అనే సందర్భంలో వాడతారు.

**సొంతవాక్యాలు**

**36.** మా అక్క వివాహం ఎంతో వైభవోపేతంగా జరిగింది.

**37.** నేను మొదటి ర్యాంకు సాధించడాన్ని తట్టుకోలేక నా స్నేహితుడు మూతి తిప్పుకున్నాడు.

**38.** రాము ఇప్పుడు ఏం చేయాలో తెలియక సతమతమవుతున్నాడు.

**రచయిత: కె. లీలాకుమార్**

www.eenadupratibha.net